# అన్నచెల్లెలు

సనగరం పార్థసారథి



వెళ్ళిపోతున్న రైలువైపే చూస్తూ నిలబడ్డాడు శ్రీకర్. తనకు, ఆ రైలుకు ఏదో అనుబంధ మున్నట్టుగా అతని కన్నులు చమ్మగిల్లాయి. పన్నిండేళ్ళ క్రితం సరిగ్గా యీ రోజే తనను రాజమండ్రి తీసుకొని పోయింది. తన్నీరోజు తన వూరు చేర్చి బాధ్యత తీరిపోయినట్టుగా వెళ్ళిపోయింది రైలు.

41 తను రాజమండ్రి జైలులో వుండగా ఆ స్టేషన్ ఎంతో మారిపోయి వుండవచ్చు ననుకున్నాడు శ్రీధరం. చెదరి ముఖంమీద పడుతున్న క్రాపును చేత్తో ఎగదోసుకొంటు స్టేషన్ నలువెపులా కలయ జూశాడు. స్టేషన్ అనుకోవలసిన మార్పేమీ చెందలేదు. గేటు దగ్గర నిలబడి టిక్కెట్లు తీసుకొంటున్న స్టేషన్ మాస్టరు, అనాడున్న 'అయ్యరు' కాడు. ఇతను ఎన్నోవాడో? తల ముగ్గుబుట్టలాగయి వంగి నడుస్తున్న పోర్టరు రంగన్న ఒక్కడే పాతవాడు.

రైలు దిగిన జనం వొక్కొక్కరే పోతున్నారు టిక్కెట్టు లేనివాడొకడు దొంగగా దాటిపోవడంచూసి శ్రీధర్ నవ్వుకొన్నాడు. రైలు తప్పిన ప్రయాణీకులు నెత్తి గుద్దుకొంటూ తిరిగి పోతున్నారు.

శ్రీధర్ చేత్తో ముఖం రుద్దుకొని పాంటు జేబులోని సిగరెట్టుతీసి వెలిగించాడు ఒక్కదమ్ము పీల్చి వదిలాడు చెదరబోతున్న పొగను 'వుఫ్' మని వూదాడు. చొక్కా ఒక్కసారి విదిలించుకొని గేటువైపుగా వెళ్ళాడు. స్టేషన్ మాస్టరుకు టిక్కెట్టు యిచ్చి బయటకు నడిచాడు.

స్టేషన్ యివతలి వైపుగా వచ్చి నిలబడి తన దుస్తుల వైపొకసారి చూచుకొన్నాడు. పూర్తిగ అరిగిన చెప్పులు. నల్లగ మురికిపట్టి నలిగిన పాంటు. గళ్ళ చొక్కా జేబు సగమువరకు చిరిగి వ్రేలాడి వుంది. చెదరిన క్రాపు తైల సంస్కారం లేకుండా వుంది.

ప్రక్కనే వున్న కుళాయి నీళ్ళతో ముఖం కడుక్కొని చొక్కాతో తుడుచుకొన్నాడు.

అతని మనస్సంతా యింటిమీదే వుంది ఇంట్లో తన చెల్లెలు సుశీల. ఆమె భర్త మూర్తి ఎలా వున్నారో? ఆమెకు ముగ్గురయినా పిల్లలుంటారు. తను వెళ్ళగానే వాళ్ళు 'మామా!' యని పిలుస్తారా? తను 'మామ'యని వాళ్ళకేం తెలుసు? తనవూరు వదిలే నగికి సులకు పెళ్ళయి మూడురోజు లయినా కాలేదు. తన తండ్రిని సుశీల, మూర్తి ఆదరిస్తున్నారో? లేదో? ఆయన త్రాగుడింకా వదల్లేదేమో? – యిన్ని ప్రశ్నలతో సతమతమవుతూ సమాధానాలు దొరక్క యింటిదారి పట్టాడు శ్రీధర్.

సుశీల తనను చూడగానే కావలించుకొని ఏడుస్తుంది. "ఇదంతా నీచలవే నన్నయ్యా" అని తననెంతో గొప్పగా జూస్తుంది. తన రాక మూర్తికెంతో ఆనందం కలిగిస్తుంది. "వీరంతా నా పిల్లలు" అని తన బిడ్డల్ని పరిచయం చేస్తుంది సుశీల. నాన్నకు తనపై యింకా కోపముంటుందా? ఛా! ఛా! ఎప్పుడో పోయివుంటుంది.—

జేబులో చిల్లరడబ్బులుతీసి బిస్కట్ పాకెట్టు కొన్నాడు పిల్లలకోసం. చెల్లెలకు పూలుకొని బయలుదేరాడు వుత్సాహంగా.

తాముండే వీధి ప్రక్క వీధిగుండా వెళ్తున్నాడు. కుడివైపు రెండంతస్తుల మేడ కనిపించింది. ఒక్క క్షణం ఆ

యింటిముందు నిలబడి పైకి చూచాడు. సీతారామయ్య భార్య పద్మావతమ్మ రెండో అంతస్తు పైభాగంలో కనిపించింది. ఆమెకు పసుపు కుంకమ చెరిగిపోయి చాల రోజు లయినట్లు తోచింది. ఆమె శ్రీధర్‌ను చూస్తూనే ముఖం ముడుచుకొని వెళ్ళిపోయింది.

శ్రీధర్ ఆవీధిలో వెళ్తుంటే అందరు వింత మనిషిని చూచినట్లు చూస్తున్నారు. అతన్ని గుర్తుపట్టిన వారు గుసగుసలాడుకొంటున్నారు. "మరలా వచ్చినాడే యీసారింకెవరిని ఖూనీ చేస్తాడో?"

"పాపం చెల్లెలి సుఖంకోసం ఎన్నో కష్టాలు పడ్డాడు" అనుకున్నారు సానుభూతిపరులు.

శ్రీధర్ గబగబావెళ్ళి యింటి తలుపు కొట్టాడు. లోపల ఎవరయినా వుంటున్నట్లు శబ్దమయినా రావడంలేదు. కొంత సేపు అలాగే తట్టాడు. ప్రక్కయింటి నుండి నరసయ్య వచ్చాడు. తేరిపారజూచి, "నువ్వా! శ్రీధర్ బాబూ! ఎవరో అనుకున్నా. యిదేనా రావడం?" అని పరామర్శించాడు. "అవును తాతా! సుశీల యింట్లో లేదా?" ఆత్రంగా అడిగాడు శ్రీధర్.

"లేరు బాబూ! వూరువదలి వెళ్ళిపోయారు."

అప్పటివరకు తలుపుకు తాళం వేసినట్లు శ్రీధర్ గమనించలేదు.

"మానాన్న....?"

"ఆసంగతి తరవాత మాట్లాడుకుందాంగాని లోపలకు రా బాబూ!"

"పరవాలేదులే తాతా! నాన్న సంగతి చెప్పండి."

"మీనాన్న ఓరోజు తప్పతాగి వస్తూ ఏట్లోపడి చనిపోయాడు." అని చెప్పలేక చెప్పాడు.

శ్రీధర్ ఆ వార్తను విని భరించలేకపోయాడు. అతని దేహం ఒక్కక్షణం గజగజ వణికిపోయింది. అతని చేతిలోని పూలు, బిస్కట్ జారి క్రింద పడ్డాయి.

"నాన్నా!" అని మతిచలించినట్టుగా అరచి తలపట్టుకొని విచారంగా కూర్చున్నాడు.

నరసయ్య శ్రీధర్‌ను ఓదార్చాడు. కొంత సేపటికి దుఃఖం దిగమ్రింగుకొని మనసు కుదుటపరచుకొన్నాడు.

"సుశీలా వాళ్ళు ఏవూరు వెళ్ళారు తాతా?" అతని గొంతు దుఃఖంతోనిండి మాటలు సన్నగా వినవచ్చాయి.

"విధి వెక్కిరించిందిబాబూ! నీకష్టం ఫలించలేదు, నీ కోరిక నెరవేరలేదు."

"అంటే?" సజలనేత్రాలతో ప్రశ్నార్థకంగా చూశాడు.

"మీ బావ మూర్తికి నాలుగేళ్ళక్రితం క్షయ వ్యాధి సోకింది. ఆవ్యాధి తీవ్రమయింది. ఇప్పుడు మదనపల్లె శానిటోరియంలో వుంటున్నాడు. సుశీలకూడ అక్కడే వుంది."

"నిజంగానా తాతా?" మాటలకన్న ముందు దుఃఖం పెల్లుబికి వచ్చి భోరుమని ఏడ్చాడు శ్రీధర్.

కాళ్ళ క్రిందపడి నలిగిపోతున్న మల్లె పూలు. బిస్కట్లనుకూడ గమనించే స్థితిలో లేడు శ్రీధర్.

"శ్రీధర్ బాబూ! దుఃఖించకు. భగవంతుడు చిన్నచూపు చూశాడు. మన చేతిలో ఏముంది. అంతా దేవుని చేతిలో బొమ్మలం. ఆతడెట్లా ఆడిస్తే అట్లా ఆడాలి. కష్టాలకెదురుగా నిలిచే ధీరత్వం అలవరచుకోవాలిగాని ఇలా దుఃఖించ కూడదు. లే బాబూ! యింట్లోకి వెడదాం. ఎప్పుడు ఎంగిలి పడ్డావో?" వరదయ్య శ్రీధర్ని ఓదార్చ ప్రయత్నించాడు.

కాళ్ళక్రింద పడి నలిగిపోతున్న పూలను గుప్పిటిలోకి తీసుకొని, "నా చెల్లెలు పూలు పెట్టుకొని వుండగా చూసి ఆనందించే భాగ్యానికి నోచుకోలేని దౌర్భాగ్యుడనయిపోయాను తాతా!" అని వాపోయాడు.

అతన్ని ఏవిధంగా ఓదార్చాలో వరదయ్యకు తెలియలేదు. కొంత సేపటి వరకు యిద్దరు మౌనంగా వున్నారు.

శ్రీధర్ లేచి నిలబడి "వెళ్తాను తాతా" అన్నాడు.

"ఈపూట ఆగు. తర్వాత వెళ్దువు గానిలే"

"క్షమించు తాతా!" వెళ్ళడానికి సిద్ధమయ్యాడు శ్రీధర్. అతని చేతిలోని పూలరేకులు గాలికి ఎగిరిపోతున్నాయి. మిగిలినవి క్రిందికి రాలిపోయాయి.

వరదయ్యను వదలి మరల రైలు స్టేషన్ చేరుకున్నాడు శ్రీధర్.

శ్రీధర్ రైల్లో కూర్చొన్నాడు టికె

వైపుగా ఆలోచనతో సతమతమవుతున్న అతనికి ఎదుటి బెంచీమీద కూర్చొన్న దంపతులు సుశీలా, మూరులా కనిపించారు. కళ్ళు నలుముకొని చూశాడు. మనస్సు భ్రమచే కప్పబడింది, మెదడు పనిచేయడం మానివేసింది. సుశీలలాగే వుందామె అతని దృష్టికి. "సుశీ! చెల్లెమ్మా!" అని బిగ్గరగా అరచి ఆమెను పట్టుకొనబోయాడు. ఆ యువతి భర్త శ్రీధర్ను తటాలున వొడిసి పట్టుకొని యథాస్థానంలో కూర్చోబెట్టాడు.

మతి స్థిమితంలేని మనిషిలా శ్రీధర్ 'సుశీ! సుశీ' అని పలవరిస్తూనే వున్నాడు. ఆ యువకుడు చదువు, సంస్కారము కలవాడు కనుక శ్రీధర్ను ఏమీ అనలేదు. అతని ప్రక్కనే కూర్చున్నాడు. శ్రీధర్ అసభ్య ప్రవర్తనకు కొందరతన్ని కొట్టడానికి ఉద్యమించారు. కాని వారిని ఆ యువకుడు వారించాడు.

ఫ్లాస్కులోని కాఫీని కప్పులోనికి వంచి, శ్రీధర్ చేత బలవంతంగా త్రాగించాడు. అప్పటికి శ్రీధర్ కొంచము కుదుటబడ్డాడు.

దీనంగా, కృతజ్ఞతా పూర్వకంగా శ్రీధర్ ఆ యువకుని వైపు చూశాడు. ఆ యువన శ్రీధర్ పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. తరువాత సూట్ కేసు తెరచి బిస్కట్లు తీసియిచ్చాడు. అవిచూడగానే శ్రీధర్కు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఈ వింత చర్య అందరికి ఆశ్చర్యం కలిగించింది. ఆ యువకునికి కూడా బాధ కలిగించింది.

కిటికీ గుండా కనిపిస్తున్న దృశ్యాలను అన్యమనస్కంగా చూస్తున్నాడు శ్రీధర్ అతని ముఖంలో దుఃఖ గూడు కట్టుకొని వుంది.

"మిష్టర్! ఎంత వరకు వెళ్ళుతున్నారు?" అడిగాడతను

శ్రీధర్‌కు ఆ ప్రశ్న వినిపించినట్లు లేదు, అతడు జవాబివ్వక ప్రకృతిని చూస్తునాడు.

"ఏవూరు వెళ్ళుతున్నారు." అని తిరిగి ప్రశ్నించాడతను.

"ఊ" అన్నాడే కాని మరేవిధమయిన జవాబు రాలేదు శ్రీధర్ నుండి. అతని జేబులోని టిక్కెట్టు కనిపించింది. వెంటనే జేబులో చేయిపెట్టి టిక్కెట్టు తీసి చూశాడు. 'మదనపల్లెరోడ్డు' అని వుంది. టిక్కెట్టును యధాస్థానంలో వుంచేస్తూ అడిగాడితను శ్రీధర్‌ను, "అయితే మీరు తాని టోరియం వెళ్ళా లనుకుంటున్నారా?"

'అవున'నట్లుగా తల రెండుసార్లు ఆడించాడు శ్రీధర్.

'మేముకూడ అక్కడికే వెళ్ళుతున్నాము.'

"ఆఁ" అని ఆశ్చర్యంగా అతని వైపు చూశాడు శ్రీధర్.

ఆశ్చర్యంతోపాటు అతని ఆలోచనలు గతం లోనికిపోయి కళ్ళతో నీళ్ళు సుడులు తిరిగాయి. పన్నెండేళ్ళ క్రితం జరిగిన విషయాలు కదులాడ సాగినాయి.

కాలేజీ మూయగానే శ్రీధర్ వూరు తిరిగొచ్చాడు. ఆనాడే శ్రీధర్ చెల్లెలు సుశీలకు ప్రక్కవీధిలో వున్న శీతా

> **బెండ్ బుక్!**
>
> గృహస్థు : మా ఆడపిల్లకు ఆరువు యివ్వ వద్దని మీ షావుకారుకు గట్టిగా చెప్పా గదండీ
>
> శ్రీరాము భక్తుడు: అప్పు వసూలుకు కాదండీ; పందిరి వేయాలి, ఆ లైడు ప్రోగ్రాంలు, మన పేట దర్జా చూపాలి...
>
> గృహస్థు చందాలకు బాండు బుక్కు లెందుకండీ!

రామయ్య కుమారుడు విశ్వానికి సంబంధం చేశాడు అతని తండ్రి. పెళ్ళి యిక నాలుగు రోజులే వుంది.

సుశీల ఆవిషయం అన్నకు చెప్పి కంటనీరు పెట్టుకొనింది తనకా పెళ్ళి పూర్తిగ యిష్టం లేదని తేలింది. తన తండ్రి చేసిన పొరపాటు నిర్ణయానికి చెల్లెలి జీవితం భగ్నం పొందుతుందేమోనని చాల బాధపడ్డాడు శ్రీధర్.

తల్లి రెండేళ్ళ క్రితం చనిపోతూ శ్రీధర్‌తో అంది. "నాయనా! మీ నాన్న త్రాగుడుతో, జూదంతో యిల్లంతా గుల్ల చేస్తున్నారు. సుశీలను నీ చేతుల్లో పెడుతున్నాను ఇక తల్లీ, తండ్రీ అంతానీవే దాన్ని ఒక మంచి అయ్య చేతుల్లో పెట్టే భారంకూడ నీదే నాయనా!"

తల్లికిచ్చిన వాగ్దానం శ్రీధర్‌కు జ్ఞప్తి కొచ్చింది. "సరేనమ్మా! నాన్నతో చెప్పి నీకు మంచి సంబంధం చూస్తా." అని సుశీలను వోదార్చాడు.

'సుశీల ఆనందమే తన కానందము అందుకు తనేమయినా చేయాలి. తల్లి కిచ్చినమాట చెల్లించుకోవాలి. తనచెల్లెలి కాపురం చూచి గర్వంగా ఆనందించాలి! ఎన్నోవూహలుదొర్లిపోయేవి శ్రీధర్‌కు.

తండ్రిరాకకై ఎదురుచూస్తూ కూర్చు న్నాడు. తండ్రి త్రాగి ప్రొద్దుపోయి వచ్చాడు. మాట్లాడించబోయిన శ్రీధర్‌ను చూచి చీదరించుకొని వెళ్ళి పడుకున్నాడు అతని తండ్రి. శ్రీధర్‌కు వుద్రేకం కలిగినా నిగ్రహించుకొని, తండ్రిదగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. "నాన్నా! పెళ్ళి నిశ్చయ మైనట్టేనా?" మెల్లగా అడి గాడు శ్రీధర్.

"అయినట్టే."

"మీరొక్కరే యిందుకు సమ్మతించి నిశ్చయించారా? లేక సుశీల మనసుకూడ గ్రహించి వొప్పుకున్నారా?"

"సుశీల కింకా తెలిసీ తెలియని వయస్సు. దానికి ప్రపంచ మేమి తెలుసు. నువ్వు యీ రోజే వచ్చావు." త్రాగుడుతో మాటలు తడబడుతూన్న నిదానంగా జవాబిచ్చాడు అతని తండ్రి.

కొంతసేపు మౌనంగా వుండి తరు వాత అన్నాడు శ్రీధర్. "సుశీలకీ పెళ్ళి యిష్టంలేదు. ఇష్టంలేని పెళ్ళిచేసి దాన్ని సుఖంగా వుండమని దీవించినా సుఖంగా వుంటుందంటావా నాన్నా!"

"వారికేం తక్కువ. ఇరవై ఎకరాల మాగాణి, మూడెకరాలతోట, రెండం తస్తుల మేడ. పదివేలవరకు కట్నమడు గోంది. అమ్మాయి సుఖానికేం తక్కువ? నువ్వు చెప్పు."

"ఏం చెప్పను. క్షయరోగ పీడితుడై వున్న అలుడికి సుఖమెరుగని కూతురు దరిజేరి సేవలు చేస్తుంటే నువ్వుచూచి సంతోషించ గలవేమోకాని, తెలిసితెలిసి మృత్యువు కౌగిలిలో ఆడుకునే భర్తను సేవిస్తూ, చుట్టూ భోగభాగ్యాలు పేరిగి పోతూంటే తిండికి నోచుకోలేక, సుఖ మేమిటో తెలీక నీరసించిపోయే చెల్లెల్ని చూచి "బాగున్నావా? అమ్మా!" అని ఏముఖం పెట్టుకుని అడగను నువ్వే చెప్పు నాన్నా?"

త్రాగిన మత్తుతో శ్రీధర్ మాటలతని చెవికెక్కలేదు. సుశీల తలుపు చాటు నుండి వారి సంభాషణ వింటూ కళ్ళనీళ్లు పెట్టుకొనింది.

కొంతసేపు ఘర్షణ ఆగిపోయింది. తరువాత శ్రీధర్ తండ్రితో అన్నాడు.

"నాన్నా! యీ సంబంధము అక్క ర్లేదని చెప్పు. ఇంకొక మంచి సంబంధము నేను తెస్తాను."

"ఏడిశావులే పోరా! ఇక్కడనుండి. కూతురిసుఖం తండ్రికన్న నీకేంతెలుసు. వెర్రివేషాలు మాను. గొప్పింటి సంబ ధము చేస్తున్నాము కదాఅని సంతో షించు." అన్నాడతని తండ్రి కోపంగా.

శ్రీధర్ కోపం రెచ్చిపోయింది. కోపంలో అతనికి పూర్వాపరాలు తెలియ లేదు.

"త్రాగుబోతువై మా అమ్మను సుఖ పెట్టి, స్వర్గానికి పంపావు ఇక నా చెల్లెల్ని క్షయ రోగికిచ్చి సుఖ పెట్టదలచు కున్నావ్." తీక్షణంగా అన్నాడు.

కుమారుని మాటలు తండ్రికి ములుకుల్లా తగిలాయి. దిగ్గున లేచి శ్రీధర్‌కు యీ దవడా ఆ దవడా పగిలేటట్లు కొట్టాడు.

శ్రీధర్ తండ్రికొట్టే దెబ్బలన్నీ మౌనంగా భరించాడు.

"పరవాలేదులే నాన్నా! నువ్వేగా కొట్టావు. అందుకే నాకేం చింతలేదు. సుశీలకు వేరేసంబంధము చూడు. ఇంకెన్ని దెబ్బలయినా సహిస్తాను." కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా నెమ్మదిగా అన్నాడు.

"పెళ్ళి నిశ్చయమైంది. యికమార్పు వుండదు" అని వెళ్ళిపోయాడు శ్రీధర్ తండ్రి.

శ్రీధర్‌కేమీ తోచలేదు. మౌనంగా తలుపు వరకువచ్చాడు.

అన్నకు తెలియరాదనే వుద్దేశ్యంతో జారుతున్న కన్నీటిని తుడుచుకొంది.

"నువ్వేం చింతపడకు అన్నయ్యా! నా ఖర్మమెలావుందో అలా జరగనీ."

"వీల్లేదమ్మా! ఈ పెళ్ళిజరగడానికి వీల్లేదు. సుశీ! జరిగిందేమి మనస్సులో పెట్టుకోకు. పనులు కానీయమ్మ."

పెళ్ళిపనులుచురుగ్గా సాగుతున్నాయి.

వీధి అరుగుమీద కూర్చొని అన్నిటిని మౌనంగా గమనిస్తున్నాడు శ్రీధర్. ఆలోచించుకొంటున్న అతనికి రమణమూర్తి జ్ఞప్తికొచ్చాడు.

వారిద్దరు ప్రాణ స్నేహితులు. ఒకరి ఆపదలందు మరొకరు ఆదుకోవాలనే మనస్తత్వం కలవారు.

శ్రీధర్ వెంటనే పోస్టాఫీసుకు వెళ్ళి రమణమూర్తిని వెంటనే రమ్మని టెలిగ్రాము యిచ్చివచ్చాడు.

రెండవరోజు సాయంకాలానికే రమణమూర్తి వచ్చాడు. మిత్రుణ్ణి చూడగానే



శ్రీధర్‌ కొండంత ధైర్యం వచ్చింది. తన చెల్లెలికి పరిచయం చేశాడు. తరువాత రమణమూర్తిని వూరి అంతలకు తీసుకొనివెళ్ళి తన పరిస్థితిని, చెల్లెలి అసహాయ స్థితిని వివరించాడు.

రమణమూర్తి ఒక్కక్షణం ఆలోచించాడు. మిత్రుడు ఆపదలో వున్నాడు. అతన్ని ఆదుకోవాలి. తల్లి తనమాట త్రోసిపుచ్చదు. తను ఒక నిశ్చయానికి వచ్చి, తల్లినిరమ్మని టెలిగ్రామ్ ఇచ్చాడు.

మూర్తి తల్లి సుభద్రమ్మ వచ్చింది. రమణమూర్తి తన స్నేహితునికి వచ్చిన ఆపద తెలియజేసి, తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. మూర్తి శ్రీధర్ యిద్దరు కలిసి ఆమెను ఒప్పించారు ఆమె కూడ సుశీలను యిష్టపడింది.

శ్రీధర్ తండ్రిమాత్రం ముభావంగానే వున్నాడు. శ్రీధర్ అతనికి నచ్చజెప్పి ఒప్పించబోయాడు.' తనచేతిలో ఏమీలేదని, అంతా పెళ్ళికొడుకింటివారిదేనని తప్పుకున్నాడు.

మరునాటి ఉదయమే ముహూర్తం. మూర్తికి వూర్లోనే వస్త్రపాద్యాదులు కొన్నాడు శ్రీధర్.

సీతారామయ్యను, అతని కుమారుడిని ఒప్పించడానికి వెళ్ళాడు కానివారు ససేమిరా వీల్లేదని అన్నారు బ్రతిమలాడాడు. కాళ్ళు పట్టుకొని ప్రార్థించాడు. లాభం లేకపోయింది.

కడకు విశ్వాన్నే అడిగాడు, "నీకే చెల్లెలుంటే ఆమెను క్షయరోగికిచ్చిపెళ్ళి చేస్తావా? చెప్పు విశ్వం!" అతని భుజాలు రెండుచేతుల్తోను పట్టి అడిగాడు." నా చెల్లెలి గొంతుకోసి నీవేమి సుఖపడాలనుకున్నావు. ఆమెనేమి సుఖపెట్టాలనుకున్నావు? "

విశ్వం జవాబివ్వలేదు. శ్రీధర్‌కు కోపం పెల్లుబికింది.

అతని భుజాలుపట్టి త్రోశాడు విసురుగా. అసలే బలహీనమైన విశ్వం ప్రక్కనవున్న టేబిలు అంచుకు తగిలి క్రిందపడ్డాడు.

"నా మాట అంగీకరించకపోతే, విశ్వం! నీ ఆయువు అనంతవిశ్వంలో కలిపేస్తాను."

అని కుర్చీ ఎత్తి తలమీద కొట్టాడు.

"అమ్మా!" అని గట్టిగా అరిచాడు విశ్వం శ్రీధర్ పారిపోయాడు. క్రిందనుంచి సీతారామయ్య, అతని భార్యవచ్చి చూచి దిగ్భ్రమ చెందిపోయారు.

విశ్వానికి తగిలిన దెబ్బకు నోట్లో నుంచికూడ రక్తము వస్తోంది.

వెంటనే ఎడ్లబండిమీద ప్రక్కవూరి ఆస్పత్రికి వేసుకుపోయారు. డాక్టరు విశ్వాన్ని పరీక్షజేసి చెప్పాడు బ్రతకడం కష్టం. టి. బి. తో వూపిరితిత్తులు చెడిపోయాయి తగిలినదెబ్బకు మెదడుతో సహా గుండెకూడ దెబ్బతినింది. పోలీసు రిపోర్టుయిచ్చి మరణ వాఙ్మూలము తీసుకొనడం మంచిది "

సీతారామయ్య పోలీసులకు రిపోర్టు యిచ్చాడు. ఇనస్పెక్టర్ మరణ వాఙ్మూలము రికార్డుచేశాడు. అందులోని సారాంశమిది. 'శ్రీధర్ చావుదెబ్బలు కొట్టాడు. అదే విశ్వం మరణానికి కారణం.'

సుశీల పెళ్ళి మూర్తితో జరిగిపోయింది. పెళ్ళి వస్త్రాలతోనున్న చెల్లెల్ని చూచి ఎంతగానో ఆనందించాడు శ్రీధర్.

అంతలోనే పోలీస్‌జీపు అక్కడికి వచ్చింది. అదెందుకు అక్కడ ఆగిందో వెంటనే శ్రీధర్‌కు అర్థమయింది. లోపల అందర్నీ వదలి తను జీపు దగ్గరకు వచ్చాడు. నవ్వుతూ సబ్ యిన్‌స్పెకర్ని విష్‌చేసి, 'నేనేసార్! శ్రీధర్ని నన్ను అరెస్టు చేయవచ్చు. కాని మరొక్కసారి నా చెల్లెల్ని చూసి వచ్చేస్తా." అన్నాడు.

సబ్ యిన్‌స్పెక్టరు శ్రీధర్ వింత ప్రవర్తనకు ఆశ్చర్యపడినా ఉద్యోగ ధర్మం మీరరానిది. తను అతని వెంటే లోపలికి వెళ్ళాడు అక్కడి వారికంతా యిది ఆశ్చర్యాన్నేకాక దుఃఖాన్ని కూడ కలిగించింది.

మూర్తి సబ్ యిన్‌స్పెక్టర్నీ అడిగాడు. "శ్రీధర్ అరెస్టుకు కారణం చెబుతారా?" అని.

"నేను చెబుతాను బావా!" అని జరిగినదంతా పూసగ్రుచ్చినట్టు చెప్పాడు శ్రీధర్.

చెల్లెల్ని సుఖాన్నాశించి అతడు చేసిన పనికి మనస్సులోనే శ్లాఘించారు అక్కడున్నవారు.

"బావా! నేను చేసినతప్పును మనస్సులో నుంచుకోక నా చెల్లెల్ని సుఖపెట్టావని ఆశిస్తున్నా" అని మూర్తితో అన్నాడు శ్రీధర్.

చెల్లెలివైపు తిరిగి, "సుశీ! సకల సౌభాగ్యములతో నూరేళ్ళు వర్ధిల్లు తల్లీ!" అని మనసారా దీవించాడు

"నాయనా! శ్రీధర్!" వణుకుతున్న స్వరంతో పిలిచాడు అతనితండ్రి. అతని కళ్ళనుండి నీళ్ళు జలజల కారిపోతోంది. కొడుకు ఎడబాటును సహించలేని పితృ ప్రేమ

"మూర్తి సుశీకేం తక్కువచేయడు. నాకేం పరవాలేదు. నా తప్పు మన్నించు నాన్నా!" అన్నాడు శ్రీధర్ తండ్రితో.

"భగవంతుడే! నిన్ను మన్నించుతాడు బాబూ! భగవంతుడే మన్నించుతాడు." ముఖంమీద పైకండువా వేసుకొని అక్కడనుండి వెళ్ళిపోయాడు అతనితండ్రి.

శ్రీధర్ దుఃఖాన్ని దిగమ్రింగుకున్నాడు అందరివద్ద సెలవు తీసుకొని పోలీసులతో వెళ్ళిపోయాడు.


శ్రీధర్‌కు పన్నెండేళ్ళ శిక్ష పడింది.

"మిస్టర్! స్టేషను వచ్చేసింది." అని శ్రీధర్‌ను హెచ్చరించాడా యువకుడు.

"అప్పుడే వచ్చిందా?" అని నిర్లిప్తంగా దిగడానికి లేచి నిలబడ్డాడు. అతనితోపాటు వారుకూడ రైలుదిగారు.

రైలు స్టేషనునుండి ఆరోగ్యవరం నాలుగుమైళ్ళే వారు ముగ్గురు అక్కడనుండి బస్సులో ఆరోగ్యవరం చేరారు.

మూర్తిఇల్లు వాళ్ళు తెలుసుకొని వారక్కడికి వెళ్ళారు. దూరాన్నుండే సుశీల వారు ముగ్గురినిచూచింది. వారు దగ్గరగా వచ్చిన తరువాత 'నీరజా' అని కేక పెట్టింది.




'వదినా!' అని సుశీలవద్దకు పరుగెత్తిందా యువతి.

"అన్నయ్య కెలాగుంది." అడిగిందామె సుశీలను.

సుశీల గొంతు వినగానే శ్రీధర్‌కు అనిర్వచనీయమైన అనుభూతి కల్గింది. తలవంచుకొని నడుస్తున్నవాడల్లా తల ఎత్తి చూశాడు.

"సుశీ" అని గట్టిగా అరిచాడు. ఆ అరుపులో ఆవేదన, ఆనందం, అనురాగం మిళితమైవున్నాయి.

గొంతును గుర్తుపట్టి శ్రీధర్‌ను ఆనవాలుపట్టింది సుశీల.

"అన్నయ్యా!" అంటూ శ్రీధర్ చేతుల్లో వ్రాలిపోయింది.

"అమ్మా సుశీ! బాగున్నావా తల్లీ!" హృదయంలోని బాధ కన్నీరుగా మారి ఆమె శిరస్సుపై పడుతున్నాయి.

సుశీల ఏడుస్తోంది.

"అమ్మా! బావనుచూద్దాం పద." అన్నాడు ఆమెధోరణి మార్చాలని

వారిని మూర్తివద్దకు తీసుకొని వెళ్ళింది సుశీల.

మూర్తి ఒక్క-శల్యమైపోయాడు. పెళ్ళినాటి శౌండోలాంటి మూర్తి యితడేనని గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు.

"మా అన్నయ్యండి" అని భర్తకు శ్రీధర్ రాకను తెలియజేసింది సుశీల.

"శ్రీధర్ బావా! బాగున్నావా" మూర్తి కళ్ళు ఆనందంతో మెరిశాయి. అతనిస్వరం నూతిలోనుండి వచ్చినట్టుగా వుంది.

శ్రీధర్ మౌనంగా నవ్వాడు. ఆ నవ్వులో విషాదం తప్ప మరొక్కటి లేదు.

అతనికి మూర్తి తప్ప మరేం కనిపించుటలేదు.

"అన్నయ్యా!" అంది నీరజ మూర్తి నుద్దేశించి

"ఇదేనా నీరూ! రావడం బావ రాలేదా?" మూర్తి అడిగాడు.

నీరజ భర్త మూర్తి మంచం దగ్గరగా వెళ్ళాడు.

"అన్నయ్యా! యీమె మీ బావగారి చెల్లెలు నీరజ. ఈయన ఆమె భర్త." శ్రీధర్‌కు వాళ్ళిద్దరిని పరిచయంచేసింది సుశీల.

శ్రీధర్ అవేమి మనస్సుకెక్కడం లేదు. వారి పరిచయాలతో అతనికి నిమిత్తంలేదు. అతనిధ్యాస మరెక్కడో వుంది. అతని కళ్ళు చెరువులయ్యాయి కట్టతెగి ప్రవహించే వరదలా కన్నీరు ప్రవహిస్తోంది.

ఆఖరి క్షణపు జ్యోతిలా మూర్తి ప్రకాశంగా వున్నాడు. తలఎత్తి సుశీలవైపు చూశాడు శ్రీధర్.

ఆమె ముఖానపెట్టిన కుంకుమ రాలిపోతున్నట్టుగా తోచింది శ్రీధర్‌కు కుంకుమపోయినచోట విధివ్రాసిన వంకర గీతలు స్పష్టంగా కనిపించసాగాయి అతని అంతర్నేత్రానికి. ★



సమ్మె కొనసాగింపు

★

పెనిమిటి: పదిహేనురోజుల నుంచి టిఫిన్ చేయకుండా సమ్మె చేస్తున్నావు; ఉగాది కదా యీనాడైనా పిండి వంటలు చేశావు కాదు.

పెళ్ళాం: వాడ కట్టులో గృహిణులం అందరం ఇంకా పదిరోజులదాకా తైలపక్వం చేయ కూడదని నిశ్చయించాము.

పెనిమిటి: అబ్బో, నవమికి కూడా అప్పచ్చి వుండదా? శ్రీరాముడి దయ!

—పుచ్చా పూర్ణానందం.